క్లుప్తంగా

గవర్నర్ పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు



గంగన్నగూడెంలో గవర్నర్ సమావేశం నిర్వహించే శ్రీ కృష్ణ కన్వెన్షన్ హాలు

దెందులూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారంలో భాగంగా వికసిత్ భారత్ ప్రచారంలో భాగంగా రాష్ట్ర గవర్నర్ ఈ నెల 12న గాలాయగూడెం శ్రీ కృష్ణా కన్వెన్షన్ హాలుకు రానున్నారు. గవర్నర్ పర్యటన ఏర్పాట్లలో భాగంగా జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీలు, వీఆర్వోలు, పోలీసులు శ్రీ కృష్ణా కన్వెన్షన్ హాలును పరిశీలించారు. సోమవరప్పాడు, గోపన్నపాలెం, గాలాయగూడెం గ్రామాలకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



దెందులూరులో సీతామహాలక్ష్మికి రూ.లక్ష బీమా చెక్కును అందజేస్తున్న కట్టా ఏసుబాబు

దెందులూరు: వైఎస్సార్ జగనన్న కాలనీలో యండమూరి నాగవెంకట విజయ్ ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందారు. అతని భార్య సీతామహాలక్ష్మికి శనివారం మంజూరైన వైఎస్సార్ బీమా రూ.లక్ష చెక్కును వలంటీర్ రమాదేవి మండల సచివాలయాల కన్వీనర్ కట్టా ఏసుబాబు, 11వ వార్డు మెంబర్ కట్టా దుర్గాంబ, బీ. పద్మావతి అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మాధురి ఉన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించండి



వట్లూరు ఆర్‌బీకేను పరిశీలిస్తున్న ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి

పెదపాడు: మాసూళ్ల అనంతరం ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులోని రైతు భరోసా కేంద్రాన్ని ఆర్డీవో శనివారం పరిశీలించారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని త్వరిత గతిన తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, వీఆర్వోలు ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి, రవికుమార్, బీ కోటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



అలుగులగూడెం జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

దెందులూరు: అలుగులగూడెంలో జగనన్న కాలనీలో శనివారం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీలకు తాగు నీరు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రక్రియను వైఎస్సార్ సీపీ నేత, వార్డు మెంబరు ప్రసన్న రాణి, రవి పర్యవేక్షించారు. ప్రభుత్వం జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంపై కాలనీ వాసులు సీఎం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతికి పాదయాత్ర



తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్న చోడవరం నియోజకవర్గం గణేష్ మిత్ర బృందం

దెందులూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గం నుంచి గణేష్ మిత్ర బృందం డీ.ప్రసాద్, ఎం.ధర్మేంద్ర, ఎస్. సత్తిబాబు శనివారం తిరుపతికి పాదయాత్రగా వెళ్లారు. దెందులూరులో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా ఏసుబాబు వారికి స్వాగతం పలికి అభినందించారు. గణేష్ మిత్ర బృందం ఈ నెల 21న జగనన్న పుట్టిన రోజున తిరుపతి వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రార్థించనున్నట్టు తెలిపారు. ఈ పాదయాత్ర విజయవంతం కావాలని మిత్ర బృందాన్ని ఏసుబాబు అభినందించారు.

మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- ముంపుబారిన పడిన పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి
- సానిగూడెం, కొవ్వలిలో పర్యటన



దెందులూరు: సానిగూడెం- కొవ్వలిలో వర్షాలకు దెబ్బతిన్న వరి పైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

దెందులూరు: తుపాను కారణంగా వరి మొలకెత్తినా, రంగు మారిన ఖచ్చితంగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ మేరకు ముఖ్యమంత్రి నేరుగా ఆదేశాలు జారీ చేశారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం మండలంలో సానిగూడెం, కొవ్వలి గ్రామాల్లో నీటమునిగిన వరి పొలాలను, పనలను పరిశీలించారు. బాధిత రైతులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొవ్వలి, సానిగూడెం గ్రామాల్లో మాట్లాడుతూ రైతులు తడిచిన ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టాలన్నారు. పంట నష్టాన్ని పూర్తి స్థాయిలో నమోదు చేయాలని తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య గ్రామాల్లోని వీఆర్వోలను ఎమ్మెల్యే ఆదేశించారు. రైతులు ఆందోళన చెందనవసరం లేదని, రైతు సంక్షేమ ప్రభుత్వంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర నుంచి నేటి వరకు ఉన్నారని అన్నారు. వీఆర్వోలు రైతుల సమస్యలకు సంబంధించి అందుబాటులో సకాలంలో సేవలు అందించాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో ఎన్ని వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. దాదాపు 4,453 ఎకరాలు తుపాను కారణంగా నష్టం జరిగిందని ఆయన సమాధానమిచ్చారు. వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. దుర్గారావు, తహసీల్దార్ ఏవీ నాంచారయ్య, ఏఓ గద్దె రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సానిగూడెం, కొవ్వలి సర్పంచులు శనిపల్లి రామకృష్ణ (విష్ణు), హేమలత, నాయకులు నాగభూషణం, గొల్లా వీరాస్వామి తదితరులున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు



భీమడోలు : రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు

భీమడోలు: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు చేపట్టిందని, రైతులెవ్వరూ ఆందోళన చెందనవసరం లేదని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు అన్నారు. భీమడోలు 3, పాతూరు ఆర్‌బీకేలను శనివారం మండలస్థాయి అధికారులతో కలిసి ఇటీవల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలున్న రిజిస్టర్లను ఆయన తనిఖీ చేసారు. తుపాను కారణంగా దెబ్బతిన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిబంధనలను సడలించిందన్నారు. రైతులు ఆఫ్‌లైన్, అందుబాటులోని మిల్లులకు ధాన్యాన్ని సరఫరా చేసుకునేలా నిబంధనలు సరళం చేసిందన్నారు. ఆర్‌బీకేల వద్ద గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, లారీలు అవసరమైతే ప్రభుత్వం సిద్ధం చేస్తుందన్నారు. మండల వ్యాప్తంగా 17,061 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు చేర్చడం జరిగిందని, ఇంకా మండలంలో 2,758 మెట్రిక్ టన్నుల తరలించేందుకు సిద్ధంగా ఉందన్నారు. యుద్ధప్రాతిపదికన వాటన్నింటినీ మిల్లులకు చేర్చుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, వీఆర్వో వెజ్జు వినయ్‌కుమార్, వీపీఏలు శ్రీలత, సైలాభాను, సిబ్బంది పాల్గొన్నారు.

తుపాను నష్టాలకు రైతులు అధైర్యపడొద్దు



ఉంగుటూరు : కైకరంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి

ఉంగుటూరు: తుపాను నష్టాలకు రైతులు అధైర్య పడొద్దని, ఆర్‌బీకేల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి అన్నారు. ఉంగుటూరు మండలంలోని కైకరం, తల్లాపురం తదితర గ్రామాల్లో శనివారం ముంపు బారిన పడిన పంట చేలు, తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుని వారికి భరోసా కల్పించారు. తుపాను వల్ల తడిసిన ధాన్యాన్ని తేమ శాతాన్ని బట్టి కొద్ది ధర తగ్గింపుతో నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు పలు ఆంక్షలను సడలించిందన్నారు. తుపాను వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు 25,216 క్వింటాళ్ల ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేశామన్నారు. ఇంకా 4,156 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉందన్నారు. వాటిని మిల్లులకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రైతులు ధాన్యం విషయంలో ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమణారావు, వైఎస్సార్ సీపీ నేతలు పుప్పాల గోపి, కోరిపల్లి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు

స్వీయ నియంత్రణతోనే లక్ష్యాల సాధన



పూళ్ల వసతి గృహంలో మాట్లాడుతున్న జేడీ జయప్రకాష్, సైకాలజిస్ట్ గోపాలరెడ్డి

భీమడోలు: విద్యార్థులు స్వీయ నియంత్రణతోనే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని సాంఘిక సంక్షేమ శాఖ ఏలూరు జిల్లా జేడీ వి.జయప్రకాష్ అన్నారు. పూళ్లలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో శనివారం జిల్లాలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, నారాయణపురం, బొమ్మిడి, కైకరం, పెదనిండ్రకొలను, గణపవరం హాస్టళ్లలో పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. మోటివేషనల్ ట్రైనర్ బీఎం గోపాలరెడ్డి విద్యార్థులకు మ్యాజిక్ మోటివేషనల్ తరగతులను నిర్వహించారు. స్నేహితుల ప్రభావం, అలవాట్లు, లక్ష్యం, సెల్‌ఫోన్, సోషల్ మీడియా, టీవీ, సమయం విలువ, భయపడకుండా ఏలా చదవాలి అనే అంశాలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం జేడీ వి.జయప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతి తొలి మెట్టు అని, పబ్లిక్ పరీక్షల్లో భయపడకుండా పరీక్షలు రాసి ఉత్తమ మార్కులను సాధించాలన్నారు. విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కష్టించి చదువుకోవాలన్నారు. లక్ష్యానికి ఆటంకం కలిగించే వారిని దూరంగా ఉంచాలన్నారు. అనంతరం గోపాలరెడ్డిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వార్డెన్లు పాల్గొన్నారు.

సబ్సిడీపై పెసర, మినుము విత్తనాల పంపిణీ



సత్యవోలు ఆర్‌బీకే వద్ద విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: తుపాను కారణంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ చెప్పారు. పెదపాడు మండలంలోని సత్యవోలులో శనివారం ఇటీవల తుపాను కారణంగా పంట నీట మునిగి పాడైన రైతులకు సత్యవోలు రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై అపరాల విత్తనాలు పంపిణీ చేసారు. ఎకరానికి 8 కేజీల చొప్పున అందిస్తారని మండలంలో 275 క్వింటాళ్ల అపరాల విత్తనాలు సబ్సిడీలో అందించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ తుపాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. ఇందులో భాగంగానే పెసర మినుము విత్తనాలు ముందుగా అందజేస్తున్నామన్నారు. పంట నష్టాన్ని అధికారులు నమోదు చేస్తున్నారని త్వరలోనే ప్రభుత్వం నుంచి రైతులకు పరిహారం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యవోలు సర్పంచ్ రంభా ఉమామహేశ్వరి, ఉపసర్పంచ్ పెంకి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తం.. తప్పిన ముంపు ముప్పు



పిప్పరలో ముంపునకు గురైన కాలనీని పరిశీలిస్తున్న సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు

గణపవరం: తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలు, ఎర్రకాల్వ పొంగి ప్రవహించడంతో విరుచుకుపడుతున్న వరద నీటితో ఏర్పడిన ముంపు సమస్య అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తతతో తప్పిపోయింది. గణపవరం మండలం పిప్పరలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియాలోని ఆరో వార్డు కాలనీ ఇటీవలి కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైంది. దీని పక్కనుంచే ప్రవహించే ఎర్రకాల్వకు వరదనీరు పోటెత్తడంతో గట్ల సరాసరిగా నీటి ప్రవాహ ఉధృతితో కాలనీవాసులు బిక్కుబిక్కు మంటూ కాలం గడిపారు. రెండు రోజులుగా కాలనీ మొత్తం ముంపులోనే ఉంది. దీనితో ఈ కాలనీని సర్పంచ్ కాకర బేబీ, వైఎస్సార్ సీపీ నాయకులు కాకరశ్యాంసన్, ఐఎస్‌రాజు తదితరులు శనివారం సందర్శించారు. ఎర్రకాల్వలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కాలనీలో ముంపునీరు మూడు రోజులుగా బయటకు వెళ్లడంలేదు. ఈప్రాంతం పల్లంగా ఉండటంతో ఏటా వర్షాకాలంలో మునిగిపోతుంది. కాలనీలో మూడు పెద్ద ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి ముంపునీటిని బయటకు తరలిస్తున్నారు. దీనితో కాలనీవాసులు ముంపుబారి నుంచి బయటపడ్డారు.

వైభవంగా కోటి దీపోత్సవం



అర్ధవరంలో కోటి దీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబును సత్కరిస్తున్న దృశ్యం

గనపవరం: గణపవరం మండలం అర్ధవరంలో శనివారం రాత్రి కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామ నాలుగురోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వేలాది మంది మహిళలు పాల్గొని దీపాలను వెలిగించారు.దీంతో గ్రామం దేదీప్యమానంగా ప్రకాశించింది. పలువురు గ్రామ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారని, ఇలాంటి పవిత్ర సమయంలో కోటి దీపోత్సవం నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే వాసుబాబును సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఎంపీపీ అర్ధవరం రాము పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

అభాగ్యులను ఆదుకోవడమే మానవత లక్ష్యం

భీమడోలు: భీమడోలు, గుండుగొలనులో శనివారం మండల మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్టు మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర్ తెలిపారు. భీమడోలు రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో గుండె ఆపరేషన్ చేయించుకున్న యడ్ల సత్యనారాయణకు రూ.5వేలు, ప్రతిభ గల నిరుపేద విద్యార్థి జి.హరిశంకర భవానీ ప్రసాద్‌కు రూ.15వేలు చెక్కులను అందించారు. గుండుగొలనులో పేద వృద్ధురాలు మడిచర్ల జయలక్ష్మికి బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. ఆమెకు గ్రామానికి చెందిన బర్ల రమణమూర్తి, పూడి శ్రీనివాసరావు ఒక్కొక్కరు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయం అందజేసారు. వైఎస్సార్ సీపీ నేత పున్నం గోపి నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా శాంతిరథాల చైర్మన్ అప్పక రాంబాబు, మండల చైర్మన్ గుల్ల నూకరాజు, కార్యదర్శి అడబాల శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి అల్లాడ ప్రసాద్, కోశాధికారి గుల్ల అప్పారావు, మానస ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్, ఈసీ సభ్యులు చిలపర్తి ఆదినారాయణ, మద్రాపు నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ అవాస్తవం

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ నేతలు చెరువు భూమి ఆక్రమించారంటూ టీడీపీ నేతలు చేస్తోన్న ప్రచారంలో వాస్తవం లేదని మాదేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు రూరల్ మండల గ్రామాలైన శ్రీపర్రు, గురుకులపేట పరిసరాల్లో మత్స్యశాఖకు చెందిన ఆరు ఎకరాల చెరువు ఉందని వివరించారు. 2014 నుంచి నేటి వరకు పంచాయతీ అధికారులు ఈ చెరువును శ్రీపర్రు తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమీపిస్తున్నందున టీడీపీ నాయకులు ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు చెరువును వైఎస్సార్ సీపీ నాయకులు ఆక్రమించారంటూ తప్పుడు ప్రచారం చేస్తూ, గ్రామాల్లో అలజడి సృష్టిస్తున్నారని ఆరోపించారు. మాదేపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఈ చెరువు మాదేపల్లి దళిత మత్స్యకారుల సొసైటీకి చెందుతుందని తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి హామీ ఇచ్చారని వివరించారు. స్వలాభం కోసం ప్రజల మధ్య అగాధం, అపోహలు సృష్టిస్తున్న టీడీపీ నాయకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి



నీలాద్రిపురంలో పథకాలు, అభివృద్ధి పనుల వివరాలున్న బోర్డును ఆవిష్కరించిన నాయకులు

ఉంగుటూరు: నీలాద్రిపురం సచివాలయం పరిధిలో సుమారు రూ.19కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్టు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ఉంగుటూరు మండలం నీలాద్రిపురం గ్రామ సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని అన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సహకారంతో నీలాద్రిపురం సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. గ్రామానికి ప్రధాన రహదారిని రూ. 3.50 కోట్లతో ఆధునికీరించామన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటామని ఇంటింటికీ తిరిగిన సందర్భంగా గ్రామ ప్రజలు పేర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ చదలవాడ రాజేంద్ర అధ్యక్షత వహించగా, ఉంగుటూరు మండల కన్వీనర్ మరడ వెంకటమంగారావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు పుప్పాల గోపి, రాజేంద్ర ప్రసాద్, చేబ్రోలు సొసైటీ అధ్యక్షుడు బాబ్జి, నీలాద్రిపురం గ్రామ ఎంపీటీసీ సూర్య వెంకటలక్ష్మి, నీలాద్రిపురం గ్రామ వైసీపీ అధ్యక్షుడు దిర్సిపాం కృపారావు, మండల కార్యవర్గ సభ్యులు మర్లపాటి వెంకటరత్నం, సూర్య, ఏడుకొండలు, ఎదలవాడ కిషోర్, గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఈవోపీఆర్‌డీ శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొఠారును కలిసిన వడ్డీల కార్పొరేషన్ చైర్మన్



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని కలిసిన వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముంగర

దెందులూరు: రాష్ట్ర వడ్డీల కార్పొరేషన్‌గా నియమితులైన ముంగర సంజీవ్ కుమార్ శనివారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో కొల్లేరు ప్రాంతానికి చెందిన తనను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు సహకారంతో వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, కొల్లేరు నాయకులున్నారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

దెందులూరు: స్పందన ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వచ్చిన ప్రజా సమస్యల పరిష్కార చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించారు. వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రాలను సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం సిఫార్సులు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ పీ.విజయ్‌బాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు రూరల్ మండల అధ్యక్షుడు తేరాఆనంద్ తదితరులున్నారు.

సామాజిక ఉద్యమం నిర్మించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రాథమిక విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో కలిసి సామాజిక ఉద్యమం నిర్మించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. స్థానిక చలసాని గార్డెన్‌లో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఏపీ యూటీఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను శనివారం లక్ష్మణరావు ప్రారంభించారు. ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ఎస్ ప్రసాద్, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జి, ఏలూరు జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు ఆర్ లింగరాజు, డీఈఓ పి.శ్యామ్ సుందర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాస్, కోశాధికారి బి.గోపీమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ఆరబెట్టిన ధాన్యం

పెదవేగి : రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు భరోసా కల్పిస్తోంది. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలతో రైతన్నలు ఆందోళనలో ఉన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసింది. వర్షాల కారణంగా వరి పంటలు నేల వాలి ధాన్యం నాణ్యత దెబ్బతి టోందని రైతులు అన్నారు. ధాన్యాన్ని ఏ విధంగా అమ్ముకోవాలో అర్థంకాని పరిస్థితుల్లో ఉన్న రైతన్నలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని ప్రకటించి ఊరట కల్పించారు. గ్రామాల్లోని ప్రతి రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. దెందులూరు నియోజకవర్గంలో పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల పరిధిలో మొత్తం 52 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధం చేశారు. పెదవేగి మండలంలో 10 కొనుగోలు కేంద్రాల్లో 2,355 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, దెందులూరు మండలంలో 16 కొనుగోలు కేంద్రాల్లో 19,690 మెట్రిక్ టన్నులు, పెదపాడు మండలంలో 18 కొనుగోలు కేంద్రాల్లో 5,700 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని, ఏలూరు రూరల్ మండలంలో 8 కొనుగోలు కేంద్రాల్లో 1,165 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసింది. జిల్లా వ్యాప్తంగా 1,28,457 ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

- ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. ఇప్పటికే దెబ్బతిన పంటలను సర్వే చేసి నష్ట పరిహారం ఇచ్చేందుకు కృషి చేస్తోంది. ప్రభుత్వం క్వింటా సాధారణ రకం ధాన్యానికి రూ.2,183, గ్రేడ్ ఏ రకానికి రూ.2,203 మద్దతు ధర ప్రకటించింది. రైతులు తొందరపడి ధాన్యాన్ని విక్రయించుకుని నష్టపోవద్దని అధికారులు సూచిస్తున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని రైతుల ఉన్నతి కోసం కృషి చేస్తున్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన నాయకుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. దెందులూరు నియోజకవర్గంలో ఇప్పటికే అనేక కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. రైతులు అధైర్య పడవద్దు, ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.

– కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు, ఎమ్మెల్యే